క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రేపల్లె పట్టణం, గ్రామీణం, భట్టిప్రోలు మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఇన్‌చార్జి డీఈఈ టి. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

ఘనంగా తిరుప్పావడ సేవ



నగరం: మండల కేంద్రంలోని స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం తిరుప్పావడ సేవ(అన్నకూటోత్సవం)ను అత్యంత వైభవంగా నిర్వహించారు. తిరుప్పావడ సేవతో పాడి పంటలు సమృద్ధిగా ఉండి, రైతులు సుభిక్షంగా ఉంటారని ఆలయ ప్రధాన అర్చకుడు వేదాల రాఘవేంద్ర కల్యాణ్ ఈ సందర్భంగా తెలిపారు. విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

వరహాపురంలో పారిశుధ్య చర్యలు

వరహాపురం(వేమూరు): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. మండలంలోని వరహాపురం గ్రామంలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. వర్షాలకు అంటు వ్యాధులు సోకుండా గ్రామంలో నీరు నిల్వ ఉన్న గుంతలు పూడ్చి, కాల్వల్లో ఆయిల్ బాల్స్ వదిలి, బ్లీచింగ్ చల్లించినట్లు ఎంపీడీఓ చెప్పారు. పంచాయతీ విస్తరణాధికారి శేఖర్, కార్యదర్శి సుజాత ఉన్నారు.

రాజ్యాంగ పీఠికపై అవగాహన

అమర్తలూరు(వేమూరు): రాజ్యాంగ పీఠిక గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు కె.నిరీక్షణరావు పేర్కొన్నారు. అమర్తలూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం రాజ్యాంగ పీఠికపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం మాట్లాడారు. 1950 జనవరి 26న రాజ్యాంగాన్ని అమలు పరిచిన తర్వాత స్వతంత్ర భారతదేశం సర్వసత్తాక, ప్రజా స్వామ్య, గణతంత్రంగా అవతరించిందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపల్లె రైల్వే స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె రూరల్: రేపల్లె రైల్వే స్టేషన్‌కు తూర్పు, పడమర ప్రవేశ మార్గాల్లో ఉన్న టిక్కెట్ బుకింగ్ కౌంటర్లను రైళ్ల రాకపోకల సమయంలో తెరచి ఉంచాలని బీజేపీ నాయకుడు పిన్ని సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమస్యను గతంలో పలుమార్లు స్టేషన్ అధికారులకు విన్నవించినా స్పందించకపోవటంతో సౌత్ సెంట్రల్ రైల్వే హైదరాబాద్ జనరల్ మేనేజర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా పార్శిల్ కార్యాలయాలు సమయానుకూలంగా తెరచి ఉంచడం లేదని, రైల్వే సంస్థకు సంబంధం లేని వ్యక్తులు అక్కడ రికార్డులు రాస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి, సమస్యలు పరిష్కరించాలని తెలిపారు.

కూటమి శ్రేణులకు సన్మానం



కొల్లూరు: రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో కొల్లూరు నుంచి తిరుమలకు కూటమి శ్రేణులు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్ ఆధ్వర్యంలో పాదయాత్రలో పాల్గొన్న 60 మంది టీడీపీ, జనసేన నాయకులను, కార్యకర్తలను గురువారం స్థానిక శ్రీ కాకతీయ కల్యాణ మండపంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు క్రోసూరు అప్పయ్య, వేమూరు మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ శిగిలిశెట్టి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం

తెనాలిరూరల్: తెనాలి తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరెడ్డిని గురువారం రెవెన్యూ సిబ్బంది సత్కరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఫిబ్రవరి 5న నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. తిరిగి మాతృ జిల్లాకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. డెప్యూటీ తహసీల్దారు సిద్దెల హెనాప్రియ, ఏఎస్ఓ వాసుబాబు, ఆర్ఐ జాన్, సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది హసీల్దారును సత్కరించారు.

వరి నారుకు కేరాఫ్.. రాంబొట్లవారిపాలెం

చెరుకుపల్లి: విపత్తులను తట్టుకుని, అధిక దిగుబడి అందించే వరి నారుకు మండలంలోని రాంబొట్లవారిపాలెం కేరాఫ్‌గా నిలుస్తోంది. ఖరీఫ్ సాగుకాలం ప్రారంభమవ్వగానే డెల్టా రైతుల చూపు ఈ గ్రామం వైపు మళ్లింది. ఇక్కడ సాగు చేపట్టే వరి నారుకు ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇందుకు కారణం.. ఇక్కడున్న ఇసుక దిబ్బలు.



వరి నారును మోటార్ నీటి ద్వారా తడుపుతున్న రైతు

ఎందుకంత డిమాండ్..

మాగాణిలో నారు కంటే ఇసుక నేలలో పోసిన నారు తేలికగా పీకడానికి అనువుగా ఉంటుంది. నాటిన ప్రతి మొక్కా త్వరగా చిగురిస్తుందన్న ఉద్దేశంతో రైతులు ఈ ప్రాంతానికి వస్తుంటారు. సాధారణ సాగు భూమిలో వర్షం పడితే నారు మడి దెబ్బతినే అవకాశం ఉంది. రాంబొట్లవారిపాలెంలో ఆ పరిస్థితి తలెత్తదు. ఎంతటి వర్షం కురిసినా నీటిని ఇసుక దిబ్బలు పీల్చేస్తాయి.

స్థానిక రైతులతో ఒప్పందం..

వ్యవసాయ సీజన్ మొదలవుతుంది అనగానే.. ఈ గ్రామంలో చిన్నా పెద్ద తేడా లేకుండా ఇసుక దిబ్బల్లో నారు మడులను సిద్ధం చేస్తారు. జిల్లా చుట్టు పక్కల రైతులు ఈ గ్రామ పరిసరాల్లోనే బాడుగకు నారు పెంచేందుకు స్థానిక రైతులతో ముందుగానే ఒప్పందం కుదుర్చుకుంటారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల రైతులు ఖరీఫ్‌కు ముందుగానే అడ్వాన్సులు చెల్లించి, తమకు కావాల్సిన వరి విత్తనాలను నారుగా పోయించుకునేందుకు ఒప్పందాలు చేసుకుంటారు. ప్రస్తుతం సెంటు నారు రూ.1100ల నుంచి రూ.1300ల వరకు డిమాండ్ ఉంది. నారు మడులు పోసిన రైతులు లాభదాయకంగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నవంబరు వరకు అందుబాటులో..

అకాల వర్షాలు, ఇతర విపత్తుల వల్ల వరి పంట దెబ్బతింటే మళ్లీ ఆ రైతు నారు పోసి, నాట్లు వేసేందుకు కనీసం 40 నుంచి 45 రోజుల సమయం పడుతుంది. ఆ శ్రమ లేకుండానే రైతులకు నవంబర్ నెల వరకు వరి నారును ఇక్కడి రైతులు అందుబాటులో ఉంచుతారు.

300 ఎకరాల్లో సాగు..

రాంబొట్లవారిపాలెంలో 300 ఎకరాలకుపైగా వరి నారు ప్రస్తుతం సాగులో ఉంది. ఒప్పందంపై సాగు చేసే నారు సుమారు మరో 50 ఎకరాలకు పైనే ఉంటుంది. ఇక్కడ ఎక్కువగా 2716, బీపీటీ, 5204, 1282, నెల్లూరు సన్నాలు వంటి వరి నారును ఎక్కువగా సాగు చేసి, రైతులకు అందిస్తుంటారు.

సక్రమంగా పింఛన్ల పంపిణీ జరగాలి

జిల్లా సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ జె. రాజదెబోరా

భట్టిప్రోలు: ప్రతి నెలా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని జిల్లా సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ జె.రాజ దెబోరా ఆదేశించారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో మండలంలోని సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సిబ్బంది సమయ పాలన పాటించి, విధి నిర్వహణలో చిత్త శుద్ధితో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్‌కు సంబంధించి



సమావేశంలో మాట్లాడుతున్న రాజదెబోరా

ప్రభుత్వం నుంచి విధి విధానాలు రావాల్సి ఉందని తెలిపారు. ఈ పథకం అమలులో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెల్ఫేర్ అసిస్టెంట్‌లు గ్రామ స్థాయిలో గుర్తించి, వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ జేబీవీ మల్లికార్జునరావు, రేపల్లె అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.సత్యన్నారాయణ, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ఎస్పీ తుషార్ డూడి

బాపట్లటౌన్: మెడికల్ అసోసియేషన్ పరిధిలోని వైద్యాధికారులు, ల్యాబ్ యజమానులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. జిల్లాలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఎస్పీ తుషార్ డూడిని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ హాక్ మాట్లాడుతూ బాపట్లలో కొంతకాలంగా ఐఎంఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపుల గురించి వివరించారు. ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులకు అండగా ఉంటామన్నారు. బాపట్లలో కొంత మంది ముఠాగా ఏర్పడి ప్రైవేటు వైద్యశాలలను టార్గెట్



ఎస్పీ తుషార్ డూడీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

చేస్తున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరి డాక్టర్ మధుసాల్మన్, పాలపర్తి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

బాపట్ల: ప్రజలు డయేరియాపై అవగాహన కలిగి ఉండాలని డీఎల్‌పీఓ పులి శరత్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని అడవిపల్లిపాలెం, పాండురంగాపురం గ్రామాల్లో గురువారం డయేరియాపై పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు కలుషితమైన నీటిని తాగరాదని, పారిశుద్ధ్యం నిర్వహణ సక్రమంగా చేపట్టాలని పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహార పదార్థాల విషయంలో కూడా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ మంజూరు బాష ఆధ్వర్యంలో మంచి నీటి పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జల్ జీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పి.కిరణ్ కుమార్, ఎంఆర్‌సీ శశికిరణ్, పంచాయతీ కార్యదర్శి బి.రాజశేఖర్, ఏఎన్ఎం ధనలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.



నీటి నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

కార్గిల్ యుద్ధం భారత సైనికుల శౌర్యానికి ప్రతీక

బాపట్ల: కార్గిల్ యుద్ధం భారత సైనికుల శౌర్యానికి ప్రతీకగా నిలిచిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధం జరిగి 25 ఏళ్లు కావడంతో పట్టణంలో గురువారం ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ కార్గిల్ విజయోత్సవాన్ని ప్రతి ఏడాది నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువ మోర్చ అధ్యక్షులు నాశన మణికుమార్, బొద్దు కృష్ణ చైతన్య, మామిడి రమేష్ బాబు, స్టేట్ ట్రెజరర్ కృష్ణ చైతన్య శర్మ, కృష్ణ చైతన్య, బాపట్ల మాజీ సైనిక అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

గంబూషియా చేపలతో దోమల నియంత్రణ

పార్కులోని చెరువులో చేపలను వదిలిన మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: దోమల లార్వాను నిర్వీరియం చేయడానికి గంబూషియా చేపలు ఎంతో దోహదపడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. చినరావూరు సత్యనారాయణ పార్కులోని చెరువులో గురువారం గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ చేపలను చెరువులో వదలడం వల్ల దోమల వ్యాప్తి తగ్గుతుందన్నారు. పట్టణంలోని వివిధ చెరువులు, కాల్వలు, బావుల్లో వీటిని వదలనున్నట్లు ఆమె తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, ఫైలేరియా, చికున్ గున్యా, డెంగీ, మెదడువాపు వ్యాధులు సంభవించే అవకాశం ఉందన్నారు. దోమలను నియంత్రిస్తే చాలా వరకు రోగాలను అరికట్ట వచ్చని తెలిపారు. 15వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ దాతల సహకారంతో చినరావూరు పార్కును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నటరాజ్ జ్యూయలర్స్ అధినేత కుమార్ సహకారంతో ఆట వస్తువులు పార్కులో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, ఆవుల కోటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, పెదలంక వెంకటేశ్వరరావు, మట్లపూడి రాజేశ్వరరావు, అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి, సబ్ యూనిట్ అధికారి శ్రీకంత ఉమాకాంత్, వంగాల పున్నారెడ్డి, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ఉద్యానవన శాఖాధికారి శేషుబాబు పాల్గొన్నారు.



చెరువులో చేపలను వదులుతున్న చైర్ పర్సన్ రాధిక, వైస్ చైర్మన్‌లు హరిప్రసాద్, నాగవేణి

అధ్యాపకురాలు శివలక్ష్మికి డాక్టరేట్ ప్రదానం

బాపట్లటౌన్: తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో ఇంగ్లీష్ అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్న నందిరాజు తోట గ్రామానికి చెందిన ఉప్పాల శివలక్ష్మికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. వర్శిటీలోని పి. రేణుక నేతృత్వంలో స్టడీ హ్యాబిట్స్, ఎడ్యుకేషనల్ అండ్ ఒకేషనల్ ఇంట్రెస్ట్ ఆఫ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్ అనే అంశంపై చేసిన పరిశోధన గ్రంథాన్ని యూనివర్శిటికి సమర్పించినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ జీవనజ్యోతి వెల్లడించారు. ఆమె పలు జాతీయ అంతర్జాతీయ జర్నల్స్‌లో అనేక పరిశోధన పత్రాలను సమర్పించినందుకు గానూ పీహెచ్‌డీ అందించడం జరిగిందన్నారు. నందిరాజు తోట గ్రామస్తులు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఎస్ఐ జె.రాజశేఖర్ వీఆర్‌కు బదిలీ

వేమూరు: మండల ఎస్ఐ జె.రాజశేఖర్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ నాగరాజును అద్దంకికి బదిలీ చేశారు. చందోలు పోలీసు స్టేషన్ ఎస్ఐగా పని చేస్తున్న ఇక్కడకు వచ్చిన జె.రాజశేఖర్‌ను గురువారం బదిలీ చేస్తూ.. ఉన్నతాధికారులు ఆదేశాలు చేశారు.

చుండూరు బస్సు సౌకర్యానికి వినతి

తెనాలి అర్బన్: చుండూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని తన్నీరు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్ కోరారు. ఈ మేరకు తెనాలి ఆర్టీసీ డిపోలో డీఎం ఎ.రాజశేఖర్‌ను గురువారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుండూరు మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం పలు గ్రామాల నుంచి ప్రజలు నిత్యం వస్తుంటారన్నారు. అయితే బస్సులు లేక వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తన్నీరు శ్రీనివాస్, ఎం.వెంకటేష్, హనుమంతరావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



తెనాలిరూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని సంగం జాగర్లమూడి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హనీఫ్, జలజీవన్ మిషన్ కో–ఆర్డినేటర్ తేజ్ సంగీత్ విద్యార్థులకు సూచించారు. జల జీవన్ మిషన్ డీపీఎంయూ ఆధ్వర్యంలో మండలంలోని అంగలకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డయేరియాపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. డయేరియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులు, వైద్యులు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ కీర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఆశ కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

తెనాలిరూరల్: మండలంలోని కఠెవరం జెడ్పీ ఉన్నత పాఠశాలను తెనాలి ఉప విద్యాశాఖ అధికారి జె.శాంతకుమారి గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు తగ్గకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అదనపు తరగతులను నిర్వహించాలన్నారు. డీవైఈఓ వెంట గ్రామ సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, పాఠశాల ఇన్‌చార్జి టి.అనంతలక్ష్మి, ఉపాధ్యాయుడు మదన్‌మోహన్ ఉన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తాతావారిపాలెం(భట్టిప్రోలు): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఇన్‌చార్జి తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని సూరేపల్లి పంచాయతీ తాతావారిపాలెంలో వైరల్ ఫీవర్లు విజృంభించి గ్రామస్తులు రోగాల బారిన పడటంతో పంచాయతీ, వైద్య ఆరోగ్య సిబ్బంది అందిస్తున్న సేవలను గురువారం ఆయన పరిశీలించారు. గ్రామంలో జ్వర బాధితులను పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని, అప్పుడే జ్వరాల బారిన పడకుండా ఉండవచ్చునని తెలిపారు. గ్రామంలో మురుగు కాల్వల పూడిక ఎప్పటికప్పుడు తీయించి, నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్, సున్నం చల్లించాలని సిబ్బందికి చెప్పారు. జ్వరాలు అదుపులోకి వచ్చేంత వరకు మినరల్ వాటర్ అందించేందుకు ముందుకొచ్చిన సర్పంచ్ విజయలక్ష్మి కుటుంబ సభ్యులను తహసీల్దారు అభినందించారు. జ్వర లక్షణాలు ఉంటే.. వైద్య ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ వాకా సుధా, పంచాయతీ కార్యదర్శి టి.అనూరాధ, వీఆర్వో ఎల్.సురేష్, గ్రామ పెద్దలు మోర్ల సత్యన్నారాయణ, వాకా శేషు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.



జ్వర బాధితుల వివరాలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జి తహసీల్దారు శ్రీనివాసరావు

వరి నారుమడిలో నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి

చెరుకుపల్లి: వరినారు మడి ఏర్పాటు చేసుకునే ముందు మెత్తగా చదును చేసి, నీరు పెట్టడానికి, బయటకు పంపడానికి కాలువను ఏర్పాటు చేసుకోని.. నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయశాఖ మండలాధికారి బాలాజీ గంగాధర్ రైతులకు సూచించారు. మండలంలోని ఆరేపల్లి, తూర్పుపాలెం గ్రామాల్లోని వరి నారుమళ్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ రైతులతో మాట్లాడారు. ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పోటాష్ ఎరువులను దుక్కిలో వేయాలని సూచించారు. శిలీంద్ర నాసినితో శుద్ధి చేసి, మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు ఐదు కిలోల చొప్పున చల్లుకోవాలని వివరించారు. నారు ఒక ఆకు పురి విచ్చుకునే వరకు ఆరుతడులు పెట్టి తర్వాత పలుచగా నీరు నిల్వ కట్టాలన్నారు. నారు మడిలో జింకు లోపాన్ని గుర్తిస్తే లీటరు నీటికి రెండు గ్రాములు జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

సీపీఎం బలోపేతానికి మండవ సేవలు ఎనలేనివి

కొల్లూరు: పేద రైతులకు న్యాయం చేసేందుకు చల్లపల్లి జమిందారుకు వ్యతిరేఖంగా పోరాటాలు చేయడంతో పాటు, సీపీఎం బలోపేతానికి మండవ వెంకట సుబ్బయ్య అందించిన సేవలు ఎనలేనివని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు టి.కృష్ణమోహన్ కొనియాడారు. గురువారం ఆముదార్లంకలో వెంకట సుబ్బయ్య 21వ వర్ధంతి నిర్వహించారు. సుబ్బయ్య స్మారక స్థూపం వద్ద సీపీఎం నాయకుల ఫొటోలకు పూల మాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం కృష్ణ మోహన్ మాట్లాడుతూ.. సీపీఎం, ప్రజా సంఘాల రాష్ట్ర సమావేశాలకు ఆముదార్లంకలో ఆశ్రయం కల్పించి, పార్టీ అభివృద్ధికి దోహదపడిన వ్యక్తి వెంకట సుబ్బయ్య అని గుర్తుచేశారు. లంక గ్రామాల్లోని పేదలకు నిత్యం సహాయ, సహకారాలు అందిస్తూ వెంకటసుబ్బయ్య, చిట్టెమ్మ, కృష్ణమూర్తి ప్రజలకు సేవలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సీహెచ్.మణిలాల్, నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, బి.సుబ్బారావు, నాగేశ్వరరావు, నాగ మల్లేశ్వరరావు, బి.ఎల్.కె. ప్రసాద్, జి.సుధాకర్, సత్యనారాయణ, నాగరాజు, దీపాల సత్యనారాయణ, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.



స్మారక స్థూపం వద్ద చిత్రపటాలకు సీపీఎం నాయకుల నివాళి

మృతుడి కుటుంబానికి నిత్యావసరాలు అందజేత

కొల్లూరు: ప్రమాదవశాత్తు మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి సహృదయ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆపన్నహస్తం అందించింది. మండలంలోని తోకలవానిపాలేనికి చెందిన వాగోలు కోటేశ్వరరావు వారం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పొలం పనులు చేసుకుని జీవించే కుటుంబం పెద్ద దిక్కును కోల్పోవడంతో వారిని ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థ ద్వారా రూ.10 వేలు విలువైన నిత్యావసర సరకులను సమకూర్చారు. ఎంపీడీఓ లక్ష్మీకుమారి, సర్పంచి టి.కృష్ణమోహన్, సీపీఎం నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, బి.సుబ్బారావులు వాటిని మృతుడి భార్యకు అందజేశారు.



నిత్యావసర సరకులు అందజేస్తున్న ఎంపీడీఓ లక్ష్మీకుమారి

గ్రామాల్లో కుష్ఠు సర్వే

పెరవలి(వేమూరు): గ్రామీణ ప్రాంతాల్లో కుష్ఠు వ్యాధి లక్షణాలను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్లు మండల ప్రాథమిక వైద్యాధికారి వెంకట సురేష్ తెలిపారు. పెరవలి గ్రామంలో ఈ మేరకు వైద్య సిబ్బంది కుష్ఠు సర్వే చేపట్టారు. ప్రతి గ్రామంలో ఇద్దరు ఆరోగ్య వలంటీర్లు ఈ నెల 18 నుంచి ఆగష్టు 2వ తేదీ వరకు పరీక్షలు చేస్తారని వెల్లడించారు. వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి, తెల్ల మచ్చలు పరిశీలించడం జరుగుతుందన్నారు. తెల్ల మచ్చలకు స్పర్శ లేకపోతే వైద్యులు దృష్టికి తీసుకొస్తారన్నారు. వైద్యాధికారులు కుష్ఠు లక్షణాలు కనిపిస్తే మందులు సూచిస్తారని చెప్పారు. మండలంలో ఇప్పటి వరకు జరిగిన సర్వేలో ఒక వ్యక్తిని గుర్తించడం జరిగిందన్నారు. ఏటా జూలై, ఆగష్టు నెలల్లో సర్వే చేయడం జరుగుతుందన్నారు. తెల్ల మచ్చలు ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.



పెరవలిలో సర్వే చేస్తున్న ఆరోగ్య వలంటీర్లు

రోడ్ల విస్తరణకు చర్యలు తీసుకోండి

మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: పట్టణంలోని ప్రధాన రోడ్లను విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులను ఆదేశించారు. పట్టణంలోని బుర్రిపాలెం, మెయిన్, బోసు రోడ్లను గురువారం ఆమె సందర్శించారు. రోడ్ల విస్తరణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అలాగే మురుగు కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు కాల్వలను బాగు చేసేందుకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. దానిని నేటికి అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు కొనసాగించడం అభినందనీయమన్నారు. మురుగు కాల్వలను ప్రక్షాళన చేయడం వల్ల వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా వెంటనే వెళ్లిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఏఈలు రాజు, ఫణి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



మాస్టర్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

- మురుగు కాల్వలో వ్యర్థాలు వేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీ, చినరావూరులో జరుగుతున్న పూడిక తీత పనులను గురువారం ఆయన పరిశీలించారు. మురుగు కాల్వలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. అలాగే బయటకు తీసిన వ్యర్థాలను అక్కడి నుంచి శివారు ప్రాంతాలకు వెంటనే తరలించే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, రామచంద్రరావు, ఏఈ రాజు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.